గద్వాల పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న మహిళలు



- అమలు కాని హామీలతో ఆగం చేస్తుండ్రు
- అభివృద్ధి చేసేవారికి పట్టం కట్టాలి
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రెట్టింపు పథకాలు అమలు
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# కాంగ్రెసోళ్ల కట్టుకథలు నమ్మొద్దు

గద్వాల, నవంబర్ 26 : కాంగ్రెస్ నాయకులు అమలు కాని హామీలతో కట్టుకథలు చెప్పడానికి మీ ముందుకొస్తున్నారు. వారిని నమ్మి ఓటేస్తే ఆగమైతరని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని 31, 32, 33, 34 వార్డుల్లో ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే వార్డుల్లో తాగునీటి గోస పడ్డామని, రోడ్లపైకి వచ్చి ధర్నా చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేసి తాగునీటి గోస తీర్చామని వివరించారు. వర్షాకాలంలో బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడేవారని, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయంతో నిధులు తీసుకొచ్చి సీసీరోడ్లు, డ్రైన్‌లు ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గద్వాల ప్రజలకు ఏంచేస్తారో ఆ పార్టీ నాయకులను అడగాలని సూచించారు. గద్వాల మున్సిపాలిటీ గురించి తెలుసుకోకుండా అభివృద్ధి చెందలేదని మాట్లాడుతున్నారని, వారు ఏనాడైనా వార్డుల్లో తిరిగారా? ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. ప్రజలు నమ్ముతారని ఊసరవెల్లిలా పూటకోమాట మాట్లాడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గద్వాల మున్సిపాలిటీ మరింత అభివృద్ధికి బీఆర్ఎస్‌కు సహకరించాలని కోరారు. గద్వాలను అభివృద్ధి చేసే వారికే ఎన్నికల్లో పట్టం కట్టాలని సూచించారు. కాగా ప్రచారంలో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మున్నా బాషా, రామాంజనేయులు, ధర్మనాయుడు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్యులు, దివ్యాంగులకు అండగా**

ఆర్యవైశ్యులు, దివ్యాంగులకు అండగా తమ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్‌లో, దివ్యాంగులకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలో ఆర్యవైశ్యులు ప్రజలకు అండగా నిలిచారని, వారు మాట ఇస్తే తప్పరని స్పష్టం చేశారు. ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఆర్యవైశ్యులు మద్దతివ్వాలని కోరారు. ఆర్యవైశ్యులు, దివ్యాంగుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అంతకుముందు వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, ఆర్యవైశ్య నాయకులు నరహరి శ్రీనివాసులు, రామకృష్ణశెట్టి, రామయ్య, బాలస్వామి, సురేశ్‌శెట్టి, గట్టు ఈశ్వరయ్య, మధుమతి, రఘుకుమార్‌శెట్టి, నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణను గోస పెట్టింది కాంగ్రెస్సే..**

గద్వాల, రూరల్ నవంబర్ 26 : బీఆర్ఎస్ పార్టీకి పథకాల గోస ఉంటే కాంగ్రెస్‌కు మాత్రం స్కాంల గోస పట్టిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వీరాపురం, పుటాన్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. వలసొచ్చిన టూరిస్ట్ నేతలు చెప్పుకోవడానికి స్కీంలు లేవు, పక్క రాష్ట్రంలో అధికారం ఇస్తే ప్రజలకు పంగనామం పెట్టిరి, అది మన కండ్లకు కట్టిన సాక్ష్యంగా కనబడుతుంది. కాబట్టి ఏం చెప్పాలో తెలియక మన పథకాల మీద అభాండాలు వేస్తూ మోసం చేయడానికి వస్తారు.. వాళ్లను గమనించాలన్నారు. ఆంధ్రావాళ్ల కన్నా తెలంగాణను అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీనే, ఇప్పటికీ వాళ్ల గ్యారెంటీలకు వారంటీలు లేవు.. అన్ని కోతలే ఉంటవి అనేది రేవంత్ మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. మూడుగంటల కరెంట్ అంటడు, 10 హెచ్‌పీ మోటర్ అంటడు, ఇప్పుడే ఇంత ఇగం మాటలు మాట్లాడుతుండు, అధికారమిస్తే ఇంకేం చేస్తాడో ప్రజలు గమనించాలన్నారు. కాబట్టి కారు సార్ చెప్పిన, చేసిన ప్రగతిని అందరం అనుభవించాం, అవే ప్రగతి పతకాలు ఇప్పుడు రెట్టింపవుతున్నాయి. అందరూ కారు గుర్తుకు ఓటేసి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సర్పంచులు వెంకటరామిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల



ప్రచారంలో పాల్గొన్న మహిళలు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అధోగతే..

- వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆపింది కేంద్రమే..
- విజయుడిని మీ బిడ్డలా ఆదరించాలి: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- కారుకు జైకొట్టిన స్వతంత్ర అభ్యర్థి
- గులాబీ తీర్థం పుచ్చుకున్న 200మంది బీజేపీ నాయకులు



బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

ఎర్రవల్లి చౌరస్తా/అలంపూర్, నవంబర్ 26 : ''కాంగ్రెస్ మాట అబద్ధాల మూట.. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలు అవుతుంది. విజయుడిని మీ బిడ్డలా ఆదరించండి'' అని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. ఆదివారం ఎర్రవల్లి మండలంలోని ఎర్రవల్లి, వల్లూరు, కొండేరు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో చల్లా పాల్గొని మాట్లాడారు. విజయుడు నిరుపేద కుటుంబం నుంచి వచ్చినవాడని, నియోజకవర్గంలోని అందరి సమస్యలు అర్థం చేసుకోగలడని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీ బంధు, చేపపిల్లల పంపిణీ, గొర్రెల యూనిట్ల పంపిణీ, గీతాకార్మికులు, ఆసరా పింఛన్లతో పాటు ఎన్నో సంక్షేమపథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తూ సకలజనుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు బాటలు వేసిందన్నారు. మరోసారి తమ పార్టీకి అధికారమిస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన బీజేపీ పార్టీ నాయకులు 200మంది కారెక్కారు. అందులో యాక్తాపూర్‌కు చెందిన అలంపూర్ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి బీసన్, ఇటిక్యాల మండలం బీజేపీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మరో 200మందికి చల్లా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ప్రాంతం బాగుండాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, రవిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బషీర్‌మియా, రాగన్న, రాముడు, కృష్ణ, రఘు, పరశురాముడు, నర్సింహ, లక్ష్మణ్, నారాయణ నాయుడు, నర్సింహులు, శంకర్‌నాయుడు, వీరబాబు, నాగన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా

# విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

గద్వాల, నవంబర్ 26 : ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి తెలిపారు. ఆదివారం ఐడీవోసీ సమావేశహాల్‌లో పోలీస్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విధానాన్ని రిటర్నింగ్ అధికారి అపూర్వచౌహాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 162మందికిగానూ 74మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారన్నారు. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి 272మందికిగానూ 80మంది ఓటు వేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్, వనపర్తి, అలంపూర్, దేవరకద్ర, కొల్లాపూర్, అచ్చంపేట, జడ్చర్ల నియోజకవర్గాల నుంచి వచ్చిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని చెప్పారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఓటర్ జాబితాలో పేర్లు చెక్ చేయడం, రిజిస్టర్‌లో పేర్ల నమోదు, ఇంక్ వేయడం, బ్యాలెట్ బాక్స్‌లో బ్యాలట్ పేపర్ వేయడం వంటివి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ రోజు ఎన్నికల నియమావళి ప్రకారం పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అధికారులు నరేందర్, జ్యోతి, సరితరాణి తదితరులున్నారు.

**ఉద్యోగులతో ప్రమాణం**

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఐడీవోసీ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. దేశ ప్రజలైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగం నిర్మించుకోవడానికి పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన, భావప్రకటన, విశ్వాసం ధర్మం చేకూర్చుటకు వారందరిలో వ్యక్తి గౌరవం, జాతీయ ఐక్యతను పెంపొందించుటకు రాజ్యాంగాన్ని నిర్మించుకున్నామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాసులు, అపూర్వచౌహాన్, తాసీల్దార్లు సరితారాణి, జ్యోతి, నరేందర్, అధికారులు రమేశ్‌బాబు, లక్ష్మణ్, గోవిందయ్య, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపు.. అభివృద్ధికి మలుపు

- అలంపూర్ గులాబీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు
- గ్రామాల్లో హారతిచ్చి స్వాగతం పలికిన మహిళలు



విజయుడికి మద్దతు తెలుపుతున్న మారమునగాల ప్రజలు

ఉండవెల్లి, నవంబర్ 26 : అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు అభివృద్ధికి మలుపని ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు అన్నారు. మండలంలోని మారమునగాల-1, మారమునగాల-2, ప్రాగటూర్, శేరుపల్లి, చిన్న ఆముదాలపాడు, భైరాపురం గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. విజయుడికి ప్రజలు బ్రహ్మరథం పడుతుండగా మహిళలు హారతులు ఇచ్చి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటేసి, వేయించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజా సంక్షేమాన్ని మరిచి నేడు అధికారం కోసం ఆరు గ్యారెంటీలతో గారడి మాటలు మాట్లాడుతున్నారన్నారు. అవ్వాతాతల కోసం రూ.200 పింఛన్‌ను రూ.2వేలకు, దివ్యాంగులకు రూ.3వేలకు పెంచిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. రైతులకు రైతుబీమా, రైతుబంధు పథకాలు ఆమలు చేసి దేశంలోనే తెలంగాణకు పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసీఆర్ బీమా పథకం, సన్నబియ్యం పంపిణీ, పింఛన్లు పెంచుతామని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ 30వ తేదీన కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, సర్పంచులు శివనారాయణ, పవిత్ర, బీఆర్ఎస్ నాయకులు రవిప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రొట్టె కాల్చుతూ ఓటు అభ్యర్థిస్తున్న విజయుడు